సాక్షి
వైఎస్సార్ జిల్లా
బుధవారం, 11, అక్టోబర్, 2023



అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ హెచ్చరించారు. -10లో



మహిమగల కమండలం పేరుతో టోకరా

మహిమ గల కమండలమని నమ్మించి ఓ స్వామీజీ వద్ద రూ.1.5 లక్షలు వసూలు చేసిన నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. -10లో

గరిష్ఠం/కనిష్ఠం
36.7/26.8

వాతావరణం

జిల్లాలో సోమవారం 26.8 - 36.7 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

వెబ్‌సైట్‌లో సీనియారిటీ జాబితా

వైవీయూ: ఆదర్శ పాఠశాలల్లో పనిచేస్తున్న జోన్-4 పరిధిలోని టీజీటీలకు పీజీటీలుగా పదోన్నతి కల్పించేందుకు తుది సీనియారిటీ జాబితాను డీఈఓ ర్యాలయాల్లో ఉంచినట్లు కడప ప్రాంతీయ సంయుక్త సంచాలకులు ఎం.వెంకటకృష్ణారెడ్డి పేర్కొన్నారు. టీజీటీలు సర్వీసు రిజిష్టర్లు, ఒరిజినల్ సర్టిఫికెట్స్, మూడేళ్ల యాన్యువల్ కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్స్‌తో కడప నగరంలోని గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్‌లో ఈ నెల 12వ తేదీన ఉదయం 10 గంటలకు హాజరు కావాలని ఆయన సూచించారు.

దూర విద్యా విధానంలో సర్టిఫికెట్ కోర్సులు

వైవీయూ: గుంటూరులోని ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సార్వత్రిక, దూరవిద్యా విధానంలో సర్టిఫికెట్ కోర్సులు చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కడప కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.ఎ.వీరయ్య ఓ ప్రకటనలో తెలిపారు. నవంబర్ 20వ తేదీ నుంచి నాలుగు ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల(చిరుధాన్యాలు, జీవన ఎరువులు, పట్టుపురుగుల పెంపకం, సేంద్రియ ఎరువులు, వర్మి కంపోస్టు తయారీ)ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు రూ.1500/-ఫీజు చెల్లించి నవంబర్ 15 లోపు చేరవచ్చని తెలిపారు.

రామారెడ్డికి గడియారం సాహిత్య పురస్కారం



నరాల రామారెడ్డి

కడప కల్చరల్: జిల్లాలో ప్రసిద్ధ అవధాన కవి డాక్టర్ నరాల రామారెడ్డికి మహాకవి డాక్టర్ గడియారం వేంకట శేషాస్త్రి సాహిత్య పురస్కారం అందజేయనున్నట్లు రచన సాహిత్య వేదిక కార్యదర్శి డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి తెలిపారు. 2020 సంవత్సరం నుంచి సాహితీవేత్తగా ఆయన అందించిన సేవలను దృష్టిలో పెట్టుకుని పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. నవంబరు 5న నిర్వహించే సభలో అవార్డు కింద రూ.10 వేల నగదు, ప్రశంసా పత్రం అందజేస్తామన్నారు.

ఐటీ ఉద్యోగాలకు ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో డైరెక్టర్

వేంపల్లె: ప్రముఖ ఐటీ దిగ్గజ సంస్థ క్యూట్ హైవేస్‌కు ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు తొమ్మిది మంది ఎంపికైనట్లు డైరెక్టర్ సంధ్యారాణి పేర్కొన్నారు. సీఎస్ఈ విభాగానికి చెందిన మహమ్మద్ రెహమాన్, డిష్ణ, హిమబిందు, చందన్, అంజలి, రేఖ, హర్షవర్ధన్‌రెడ్డి, పరశురాం, జయేష్ రంజన్, లోకేష్ ఎంపికకగా వారికి వార్షిక వేతనం రూ.6.5 లక్షలు ఇవ్వనున్నారని తెలిపారు. ఛాన్సలర్ కేసిరెడ్డి, వైస్ ఛాన్సలర్ విజయ్ కుమార్, ఏవో రాంభూపాల్‌రెడ్డి, నాగరత్న, కిషోర్, సుందర్, రవిబాబు విద్యార్థులను అభినందించారు.

వైద్యారోగ్య శాఖ ఆర్డీగా రత్నకుమారి



డాక్టర్ రత్నకుమారి

కడప రూరల్: వైద్య ఆరోగ్య శాఖ జోన్-4 రీజనల్ డైరెక్టర్‌గా డాక్టర్ రత్నకుమారి బాధ్యతలు చేపట్టనున్నారు. ఏలూరు జిల్లా ఎయిడ్స్ లెప్రసీ అండ్ టీబీ కంట్రోల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఆమె పదోన్నతిపై రీజనల్ డైరెక్టర్‌గా ఇక్కడికి రానున్నారు. ప్రస్తుతం అడిషనల్ డైరెక్టర్ (ఎంసీహెచ్) డాక్టర్ కేవీఎస్ఎస్ అనిల్‌కుమార్ ఇన్‌ఛార్జ్ రీజనల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ స్థానంలోకి రత్నకుమారిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్: అంగన్వాడీ పోషణ్ 2.0 కింద జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత కార్యాలయంలో డిస్ట్రిక్ట్ కో - ఆర్డినేటర్, ప్రాజెక్టు అసిస్టెంట్ పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి శ్రీలక్ష్మి తెలిపారు. ఒప్పంద పద్ధతిన ఏడాది కాలం పనిచేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆమె తెలిపారు. దరఖాస్తు ఫారాలు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ సాధికారత అధికారి కార్యా లయంలో లభిస్తాయన్నారు. దరఖాస్తు ఫారంతోపాటు అర్హతా ధ్రువపత్రాలను జత పరచి ఈ నెల 18వ తేదీలోగా సమర్పించాలని కోరారు.

ఊర్లోనే మండీ.. ఆదాయం దండీ

చీనీ రైతుల కల నెరవేరింది.
ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న బత్తాయి రైతుల కష్టాలు ఇపుడు దూరమయ్యాయి. పులివెందులలో మండీ ఏర్పాటు చేసి సూట్ లేకుండా బహిరంగ వేలం నిర్వహించడం, మంచి ధర లభించడంతో రైతులలో ఆనందం వ్యక్తమవుతోంది.

- సూట్ లేకుండా పులివెందులలో కాయల కొనుగోళ్లు
- బహిరంగ వేలంతో రైతులకు ప్రయోజనం
- అన్నదాతలకు తగ్గనున్న రవాణా ఛార్జీలు



పులివెందుల మార్కెట్ యార్డుకు వచ్చిన చీనీకాయలు

పులివెందుల: పులివెందుల నియోజకవర్గంలో అత్యధికంగా 64 వేల ఎకరాల్లో చీనీ తోటలు సాగు చేస్తున్నారు. సింహాద్రిపురం మండలంలో 17,100 ఎకరాలు, లింగాలలో 9వేలు, తొండూరులో 7,200 ఎకరాల్లో చీనీ తోటలు సాగులో ఉన్నాయి. ఈ తోటల్లో పండించిన దిగుబడులను సూట్ లేకుండా కొనుగోలు చేసేందుకు గతంలో వ్యాపారులు సుముఖత చూపలేదు. పది టన్నుల చీనీకాయలకు రెండున్నర టన్నులు సూట్ పేరుతో ఉచితంగా ఇవ్వాల్సిన పరిస్థితి ఉంది. ఆరుగాలం కష్టించిన అన్నదాత తీవ్రంగా నష్టపోయారు. స్థానికంగా చీనీ కొనుగోలు కేంద్రం (మండీ) లేక వ్యాపారులు చెప్పిన ధరకే విక్రయించాల్సిన పరిస్థితి. అనంతపురం మార్కెట్‌కు తీసుకుపోయినా బహిరంగ వేలం లేక, అదనపు రవాణా ఖర్చులతో గిట్టుబాటు ధర దక్కేది కాదు. రైతుకు సరైన మార్కెట్ సౌకర్యం లేక, గిట్టుబాటు ధర లభించక ఇబ్బందిపడ్డారు.

అనంతపురం మార్కెట్‌కు ధీటుగా..

రాయలసీమ జిల్లాలో చీనీ మార్కెట్‌కు అనంతపురం ప్రసిద్ధి. ఆ మార్కెట్‌కు ధీటుగా ఇక్కడ మార్కెట్ ఏర్పాటుచేస్తే చీనీ రైతులకు వ్యయ ప్రయాసలు తగ్గుతాయని భావించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల వ్యవసాయ మార్కెట్‌లో సూట్ లేకుండా, బహిరంగ వేలం నిర్వహించి కాయలు కొనుగోలు చేయాలని నిర్ణయించారు. దీంతో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో సెప్టెంబర్ 10న చీనీకాయల మండీ (కొనుగోలు కేంద్రం)ని ప్రారంభించారు. దిగుబడులు ఉంచేందుకు జంబో షెడ్‌లు ఏర్పాటు చేశారు.తూకాలకు లోపలే వే బ్రిడ్జి సౌకర్యం, కాయల సైజులను వేరుచేసేందుకు గ్రేడింగ్ మిషన్ అందుబాటులో ఉంచారు. ఈ మార్కెట్‌కు దిగుబడులు తెస్తే కలిగే ప్రయోజనంపై పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి రైతులకు అవగాహన కల్పించారు. నాలుగు జిల్లాల్లో పేరొందిన వ్యాపారులను రప్పించి సందేహాలు నివృత్తి చేశారు.

పులివెందులలోనే ధర అధికం

ఇప్పటివరకు అనంతపురంలో కేవలం నాలుగు రోజులు మినహా ఇక అన్ని రోజుల్లోనూ అత్యధిక ధర, ఎక్కువ సరుకు పులివెందుల మార్కెట్‌కే రావడం వ్యాపారులను విస్మయపరిచింది. అక్టోబర్ 9న అనంతపురం మార్కెట్‌లో టన్ను చీనీకాయలకు గరిష్ఠంగా రూ.20వేలు పలుకగా, పులివెందుల మార్కెట్‌లో టన్ను రూ.24,600 ధర పలికింది. అక్టోబర్ 3న 129 టన్నులు రాగా గరిష్ఠంగా టన్నుకు రూ.24,300లు లభించింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు మొత్తం 1,427 టన్నులకు పైగా క్రయవిక్రయాలు సాగాయి. వీరపునాయునిపల్లె, తాడిపత్రి నుంచి ఈ మార్కెట్‌కు తరలించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

తేదీ (అక్టోబర్)	చీనీకాయలు (టన్నుల్లో)	పులివెందులలో ధర (టన్నుకు)	అనంతపురంలో ధర (టన్నుకు)
03	129.30	24,300	20,000
04	97.55	25,700	20,000
05	127.22	25,000	20,000
06	111.52	23,700	20,000
07	100.22	24,700	18,000
09	154.24	24,600	20,000
10	137.39	26,100	19,200

దూరాభారం తగ్గింది



చీనీ మార్కెట్ పులివెందులలో ఏర్పాటు చేయడంతో దూరాభారం తగ్గి డబ్బులు మిగులుతున్నాయి. నేను పది ఎకరాల్లో చీనీ తోట సాగు చేస్తున్నా. ఏటా స్థానిక వ్యాపారులకు విక్రయించడంతో పది టన్నులకు రెండున్నర టన్నులు సూట్ పేరుతో ఉచితంగా ఇవ్వాల్సి వచ్చేది. నేడు పులివెందుల మార్కెట్‌లో ఎలాంటి సూట్ లేకుండా బహిరంగ వేలంపాటతో చీనీకాయలను కొనుగోలు చేస్తున్నారు. మంచి ధర పలుకుతోంది.
- ఎస్.కె.సూరజ్, చీనీ రైతు, మల్లేల, తొండూరు మండలం

అనంతపురం కంటే అధికం



ఆరు నెలల కిందట చీనీ కాయలను అనంతపురం మార్కెట్‌కు తీసుకుపోయా. కానీ అక్కడ బహిరంగ వేలం లేదు. దీంతో రవాణా ఛార్జీలు, అక్కడి ధరలతో పోలిస్తే గిట్టుబాటు కాలేదు. స్థానికంగా అనంతపురం కంటే పులివెందుల మార్కెట్‌లోనే ఎక్కువ ధరలు పలుకుతున్నాయి. రవాణా ఛార్జీలు సగానికిపైగా తగ్గుతాయి. ప్రస్తుతం ఇక్కడ బహిరంగ వేలంతో టన్నుకు రూ.23,000 ధర పలికింది.
- ఓబుళరెడ్డి, చీనీరైతు, బి.కొత్తపల్లి, సింహాద్రిపురం మండలం

చీనీ మార్కెట్‌ను సద్వినియోగం చేసుకోండి



ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన పులివెందుల చీనీ మార్కెట్‌ను జిల్లా రైతులు సద్వినియోగం చేసుకోండి. సూట్ లేకపోవడం, బహిరంగ వేలంపాటతో కొనుగోలు, తక్కువ సెస్ ఇలా అనేక వెసులుబాట్లు ఉన్నాయి. సద్వినియోగం చేసుకుంటే పక్క జిల్లాకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలు మిగులుతాయి. నాణ్యమైన చీనీ కాయలకు మంచి ధర లభిస్తోంది.
-చిన్నప్ప, మార్కెట్ యార్డు చైర్మన్, పులివెందుల

చీనీ మార్కెట్ పరిశీలన

పులివెందుల రూరల్: పులివెందుల పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో చీనీ కాయల మార్కెట్‌ను మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు, ఛైర్మన్ చిన్నప్పతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజు రోజుకూ చీనీ కాయల మార్కెట్‌కు స్పందన లభిస్తోందన్నారు. అనంతపురం జిల్లాలోని చీనీ కాయల మార్కెట్ కంటే పులివెందుల చీనీకాయల మార్కెట్‌లో ధరలు బాగుండడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారని అధికారులు తెలిపారు. మంగళవారం టన్ను రూ.26 వేలు పలికినట్లు వారు తెలిపారు. మార్కెట్‌లో 136 టన్నుల చీనీకాయలకు వేలంపాట నిర్వహించారన్నారు.



చీనీకాయలను పరిశీలిస్తున్న జేడీ రామాంజనేయులు, చైర్మన్ చిన్నప్ప

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించాలి

కడప సెవెన్‌రోడ్స్: ప్రభుత్వం నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా పరిషత్ సీఈఓ సుధాకర్‌రెడ్డి సూచించారు. జెడ్పీలోని డీపీఆర్‌సీ సమావేశ మందిరంలో ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎస్ఓలకు పంచాయతీ డెవలప్‌మెంట్ ఇండెక్స్ కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. సీఈఓ మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలోని ఆరోగ్యం, విద్య, పౌష్టికాహారం, మహిళా సాధికారత, ఆర్థిక స్వావలంభన, తదితర అంశాలలో డేటా తయారుచేసి సచివాలయ సిబ్బంది ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కోరారు. కడప, జమ్మలమడుగు డీఎల్‌డీఓలు వెంకట సుబ్బయ్య, సుబ్రహ్మణ్యం, పులివెందుల ఎంపీడీఓ వెంకటేశ్ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ ఇచ్చారు.

నష్టపోయిన పంటలకు పరిహారం

కడప అగ్రికల్చర్: జిల్లాలో 2023-24 సంవత్సరరంలో ఖరీఫ్, రబీ సీజన్‌కు వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో దిగుబడి ఆధారంగా దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం నష్టపరిహారాన్ని చెల్లించనుంది. అన్నమయ్య జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు కంది, వరి, రబీ సీజన్‌లో వేరుశనగ పంటకు ఓరియంటల్ జనరల్ ఇన్సూరెన్స్ పరిహారం చెల్లించనుంది.. వైఎస్సార్ జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు గ్రామ యూనిట్‌గా వరికి, జిల్లా యూనిట్‌గా కంది, జొన్న, మినుము, పసుపు పంటలకు, రబీ సీజన్‌లో గ్రామ యూనిట్‌గా శనగకు, జిల్లా యూనిట్‌గా వరి, జొన్న, మినుము, వేరుశనగ, నువ్వులు, పొద్దుతిరుగుడు పంటలకు హెచ్‌ఎఫ్‌డీసీ బ్యాంకు పరిహారం చెల్లించనుంది. వాతావరణ పరిస్థితులకు పంటలు దెబ్బతిన్న ప్రాంతాల్లో అన్నమయ్య జిల్లాకు సబంధించి ఖరీఫ్‌లో వేరుశనగ, టమోట పంటలకు రబీ సీజన్‌కు సంబంధించి అరటి, టమోట పంటలకు మండల యూనిట్‌గా బజాజ్ ఇన్సూరెన్స్ చెల్లించనుంది. వైఎస్సార్ జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ, చీనీ పత్తి పంటలకు మండల యూనిట్‌గా, రబీ సీజన్‌లో అరటి, టమోట పంటలకు మండల యూనిట్‌గా యూనివర్సల్ సోంబో చెల్లిస్తుంది.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు పరిశీలిస్తాం

- కలెక్టర్ విజయరామరాజు
- 27న ఓటర్ల ముసాయిదా జాబితా



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పరిశీలన చేపడతామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు అన్నారు. కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈవీఎంల పనితీరులో ఎఫ్ఎల్‌సీ ప్రక్రియ ముఖ్య అంశమని పేర్కొన్నారు. జిల్లాలో ప్రస్తుతం 6021(23 శాతం) బీయూలు, 5501 (12 శాతం) సీయూలు, 5952 (12 శాతం) వీవీ ప్యాట్స్ ఉన్నాయని, వాటికి యాక్సెప్టెన్సీ టెస్ట్ పూర్తి చేశామన్నారు. త్వరలో మాక్ పోల్ నిర్వహిస్తామని, సాంకేతిక సందేహాలుటే బెల్ ఇంజనీరింగ్ అధికారులు నివృత్తి చేస్తారని వివరించారు. ఫస్ట్ లెవెల్ చెక్‌ను వెబ్‌కాస్టింగ్ ద్వారా ఎన్నికల సంఘం ప్రత్యక్షంగా పరిశీలిస్తుందన్నారు. ఈ నెల 27న ఓటరు ముసాయిదా విడుదల చేస్తామన్నారు. ఈ సమావేశంలో వివిధ పార్టీల నాయకులు మల్లికార్జున(వైకాపా), హరి ప్రసాద్(టీడీపీ), లక్ష్మణ్‌రావు, శశిభూషణ్‌రెడ్డి(బీజేపీ), ప్రసాద్‌గౌడ్(కాంగ్రెస్), ఇతర పార్టీల నాయకులు సగిలి గుర్రప్ప, శ్రీనివాసులు, జేసీ గణేష్‌కుమార్, కమిషనర్ ప్రవీణ్‌చంద్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూబీ పనులు వేగవంతం

కడప కోటిరెడ్డిసర్కిల్: 'గతిశక్తి' ద్వారా ప్రభుత్వం చేపడుతున్న ఆర్ఓబీ, ఆర్‌యూబీ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ విజయరామరాజు ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా జిల్లాలో జరుగుతున్న ఆర్ఓబీ, ఆర్‌యూబీ పనులపై అధికారులతో ఆయన సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పది ప్రధాన మార్గాల్లోని రైల్వే లెవెల్ క్రాసింగ్ గేట్ల వద్ద ప్రభుత్వం చేపట్టే రైల్వే ఓవర్ బ్రిడ్జి, రైల్వే అండర్ బ్రిడ్జిల నిర్మాణం విషయంలో అధికారులు సమన్వయం చేసుకుని నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలన్నారు. ప్రతిపాదిత పనుల నివేదికను సమర్పించాలన్నారు. ఆర్డీవో ధర్మ చంద్రారెడ్డి, పీఆర్ ఎస్ఈ శ్రీనివాసులురెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వీరన్న, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ రమణయ్య, మాధవి, అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

పులివెందుల రూరల్: పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులపై కలెక్టర్ విజయరామరాజు మంగళవారం అధికారులతో సమీక్షించారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి పనులు ఏఏ దశల్లో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. డిసెంబర్ నాటికి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్డీఓ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

చిరు ధాన్యంతో ఆరోగ్య భాగ్యం

- జిల్లాలో చిరు ధాన్యాల సాగుకు అడుగులు
- ఈ ఏడాది 8386 హెక్టార్లలో సాగు లక్ష్యం
- పంటలకు మద్దతు ధర ప్రకటించిన ప్రభుత్వం
- పౌరసరఫరాల శాఖ ద్వారా రాగి, జొన్నల కొనుగోలు



ఓ కార్యక్రమంలో ప్రదర్శనకు ఉంచిన చిరు ధాన్యాలు

కడప అగ్రికల్చర్: నిత్యం పని ఒత్తిడి పెరిగిన ఆధునిక జీవన విధానంలో ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయడం, నిమిషం తీరిక లేకుండా గడుపుతూ వేళ కాని వేళ తిండి తినడం అలవాటుగా మారింది. శోషకాహారంపై ఆసక్తి చూపకుండా నాలుకకు రుచిగా ఉండే మసాలా ఫుడ్‌పై ఆసక్తి పెరుగుతోంది. ఫలితంగా షుగర్, బీపీలు పెరిగి జనం బాధలు హెచ్చుతూ వచ్చాయి. వైద్యులు, మానసిక నిపుణుల సూచనలతో తమ జీవన పంథా మార్చుకునేందుకు ఇపుడు జనం మొగ్గు చూపుతున్నారు. చిరుధాన్యాలతో కూడిన ఆహారానికే ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నారు.

- ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 8386 హెక్టార్లలో చిరు ధాన్యాల సాగు లక్ష్యం కాగా.. ఖరీఫ్‌లోనే 2816 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. ఇందులో జొన్న 1151, సజ్జ 385, రాగి 4, కొర్ర 298 హెక్టార్లలోనూ సాగు చేసినట్లు అధికారులు తెలిపారు. రబీన్‌లో జొన్న 9వేల హెక్టార్లు, సజ్జలు 3వేలు, మొక్కజొన్న 2100 హెక్టార్లలో సాగు లక్ష్యంగా పెట్టుకున్నారు.

రసాయన ఎరువుల వినియోగం తగ్గించేందుకే..

నాలుగు దశాబ్దాల కిందట వరకు పేద, మధ్య తరగతి ప్రజలకు...చిరు ధాన్యాలే ఆహారం. పశువుల ఎరువు, మట్టి, సేంద్రీయ ఎరువుల వాడకం ఎక్కువగా ఉండడంతో ఆ రోజుల్లో జనంలో రోగ నిరోధకశక్తి ఎక్కువగా ఉండేది. అనంతరం అధిక ఆదాయం కోసం రైతులు వరి, పత్తి, మిరప, ఉల్లి పంటలపై ఆసక్తి కనబరిచారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని పెంచేశారు. విచక్షణా రహితంగా రసాయనాలు వాడడంతో సాగు ఖర్చు పెరిగి పంట దిగుబడులు తగ్గాయి. ఆహార పంటల్లో రసాయన అవశేషాలున్నట్లు శాస్త్రవేత్తలు తెలుపడం ఇందుకు అద్దం పడుతోంది. ఇది గుర్తించిన ప్రభుత్వం చిరు ధాన్యాల సాగును ప్రోత్సహించాలని నిర్ణయించింది. రాయితీలు ప్రకటించడం, దిగుబడుల కొనుగోలు హామీ ఇవ్వడంతో చాలామంది రైతులు జొన్న, రాగి, ఇతర పంటల సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

పంటలకు మద్దతు ధర

రసాయన అవశేషాలు ఎక్కువగా ఉన్నాయని గుర్తించిన ఐక్యరాజ్య సమితి దానికి చెక్ పెట్టేందుకు 2023ను అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరంగా ప్రకటించింది. ఇందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో జిల్లాలో చిరు ధాన్యాల సాగు కాస్తంత పెరిగింది. జొన్నలు, రాగులు, సజ్జలు, మొక్కజొన్న పంటలకు మద్దతు ధర ప్రకటించింది. ఇందులో హైబ్రీడ్ జొన్నకు క్వింటాకు రూ. 3180 కాగా, సాధారణ జొన్నకు క్వింటా రూ.3225, అలాగే రాగులకు క్వింటా రూ.3846, సజ్జలకు క్వింటాకు రూ.2500, మొక్కజొన్నకు రూ.2090 మద్దతు ధర ప్రకటించింది. రైతులు పండించే జొన్న, రాగి దిగుబడులను పౌర సరఫరాల శాఖ కొనుగోలు చేయనుంది. పంటలకు మద్దతు ధర ప్రకటించి మార్కెటింగ్ సౌకర్యాన్ని కల్పించనుంది.

జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్‌లో చిరుధాన్యాల సాగు వివరాలివీ..

పంట	ఖరీఫ్‌లో లక్ష్యం హెక్టార్లలో	సాగైన విస్తీర్ణం హెక్టార్లలో	రబీలో లక్ష్యం హెక్టార్లలో
మొక్కజొన్న	574	1151	2100
కొర్ర	936	298	000
సజ్జలు	1025	385	9000
జొన్నలు	1332	978	3000

తక్కువ ఖర్చుతో ఎక్కువ రాబడి..



పంటల సాగులో ఖర్చు తగ్గించి ఎక్కువ రాబడి వచ్చే చిరు ధాన్యాల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్, రబీలో 8 వేల హెక్టార్లలో మిల్లెట్స్ సాగుకు చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశించగా ఖరీఫ్‌లోనే 2816 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. మిగతా లక్ష్యం రబీలో పూర్తి చేయనున్నాం.
- అయితా నాగేశ్వరావు, జిల్లా వ్యవసాయాధికారి

ఆరోగ్య సోపానం

కడప రూరల్: జిల్లా వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. మంగళవారం మొత్తం 28 ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంపులకు జనాలు పెద్ద ఎత్తున వచ్చి ఉచిత వైద్యం పొందారు. పెండ్లిమర్రి మండలం, తిప్పిరెడ్డిపల్లె, దర్బారోపేట గ్రామంలో మరియు కమలాపురం మండలం ఎల్లారెడ్డిపల్లెలో జరిగిన మెడికల్ క్యాంపుల్లో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు. కడప నగరం ఆర్‌కే.నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన శిబిరానికి డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డితోపాటు కార్పొరేటర్లు పాల్గొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు పర్యవేక్షించారు.

క్లుప్తంగా

ఆర్టీపీపీ ఎస్పీఎఫ్ కానిస్టేబుల్‌పై పోక్సో కేసు నమోదు

ఎర్రగుంట్ల : రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు (ఆర్టీపీపీ)లో పనిచేస్తున్న ఎస్పీఎఫ్ కానిసేబుల్ రామకృష్ణపై పోక్సో కేసు నమోదు చేసినట్లు కలమల్ల ఎస్ఐ సంజీవరెడ్డి తెలిపారు. ఆర్టీపీపీలో ఐదుగురు మైనర్ బాలికలు ట్యూషన్‌కు వెళ్లి ఇంటికి వస్తున్న సమయంలో ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ రామకృష్ణ వారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ మేరకు బాలికల తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటో చోరీ చేసిన వ్యక్తి అరెస్టు


ఆటోను చోరీ చేసిన నిందితుడితో ఎస్ఐ రాజగోపాల్, సిబ్బంది

రాజుపాళెం : రాజుపాళెం మండలంలోని కొర్రపాడు –రాజుపాళెం గ్రామాల మధ్యలో ఉన్న అమ్మ వారి ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు కె.సూర్యనారాయణాచారికి చెందిన ఆటోను చోరీ చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. రాజుపాళెం పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఎస్ఐ రాజగోపాల్ ఆటో చోరీకి సంబంధించిన వివరాలను వెల్లడించారు. క్షత్రియ ధర్మేంద్ర కుమార్ సింగ్ గత కొద్ది రోజులుగా అమ్మ వారి ఇండేన్ గ్యాస్‌ఏజెన్సీలో పనిచేసేవాడు. ఆ వ్యక్తి విలాసాలకు అలవాటు పడి వచ్చే కూలి తన ఖర్చులకు సరిపోలేదని, ఎలాగైనా ఖర్చుల కోసం డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో అమ్మ వారి ఇండేన్ గ్యాస్ ఏజెన్సీలో ఏపీ 04 టీజెడ్ 0891 అనే నంబర్‌గల గూడ్స్ క్యారేజి ఆటోను 8వ తేదీన చోరీ చేశాడు. చోరీ చేసిన ఆటోను నంద్యాల టౌన్‌లో అమ్మేందుకు వెళుతుండగా గోపాయపల్లె చెక్ పోస్టు వద్ద మంగళవారం ఎస్ఐ రాజగోపాల్, ఏఎస్ఐ సుబ్బారెడ్డి, పోలీసులు క్రాంతి, మహేష్, ఉదయ్‌లు పట్టుకున్నారు. అతనిని విచారించగా దొంగ ఆటో అని తేలడంతో ఆటోను స్వాధీనం చేసుకుని ధర్మేంద్ర కుమార్ సింగ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు. ఆటో విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని చెప్పారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు


ఎర్రగుంట్ల పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది గౌరవ వందనం స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్

జమ్మలమడుగు రూరల్ : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ హెచ్చరించారు. మంగళవారం జమ్మలమడుగు పట్టణంలోని అర్బన్, రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరల్డ్‌కప్ జరుగుతున్న దృష్ట్యా ఎంతటి వారైనా సరే క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. మట్కా, గ్యాంబ్లింగ్ నిర్వహించినట్లు సమాచారం తెలిస్తే వదిలే ప్రసక్తి లేదన్నారు. ఎవరికైన సమాచారం తెలిస్తే ఫోన్ ద్వారా సమాచారం ఇస్తే అలాంటి వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. దొంగతనాలు, నాటుసారా, అక్రమ మద్యంపై నిఘా పెట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం నూతనంగా నిర్మించిన మోడల్ పోలీస్ స్టేషన్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగరాజు, సీఐలు సదాశివయ్య, గోపాల్‌రెడ్డి, ఎస్ఐ సుబ్బారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాలు అరికట్టేందుకు గస్తీ ముమ్మరం చేయాలి

ఎర్రగుంట్ల : దొంగతనాలు అరికట్టేందుకు గస్తీ ముమ్మరం చేయాలని జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎర్రగుంట్ల, కలమల్ల పోలీస్ స్టేషన్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారుల సమన్వయంతో నాటుసారా, అక్రమ మద్యంపై దాడులు ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. స్టేషన్ ఆవరణంలో పచ్చదనం పెంపొందించాలని, పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ట్రాఫిక్, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. తర్వాత రెండు స్టేషన్‌లలో రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు డీఎస్పీ నాగరాజు, ఎర్రగుంట్ల, కొండాపురం సీఐలు ఈశ్వరయ్య, వేణుగోపాల్, కలమల్ల, ఎర్రగుంట్ల ఎస్ఐలు సంజీవరెడ్డి, ప్రవీణ్‌కుమార్, కృష్ణంరాజు నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిమగల కమండలం పేరుతో టోకరా

- కడప స్వామీజీ దగ్గర రూ.1.50లక్షలు వసూలు
- ఇద్దరు నిందితుల అరెస్టు


అరెస్టయిన నిందితులతో పోలీసులు


స్వాధీనం చేసుకున్న నగదు, కమండలం

గుర్రంకొండ : తమ పొలంలో తవ్వకాలు జరుపుతుండగా పురాతన మహిమ గల కమండలం లభించిందని నమ్మించి ఓ స్వామీజీ దగ్గర రూ.1.50లక్షలు వసూలు చేసిన సంఘటనలో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 1.50లక్షలు, నకిలీ కమండలాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొన్న సంఘటన మండలకేంద్రమైన గుర్రంకొండలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ములకలచెరువు మండలం దేవలచెరువు గ్రామానికి చెందిన నాగరాజు(51), రమణ(48) అనే ఇద్దరు వ్యక్తులు వైఎస్సార్ జిల్లా కడపకు చెందిన బాల శివయోగేంద్ర స్వామీజీని కడపకు వెళ్లి కలిశారు. తమది గుర్రంకొండ పక్కన ఓ పల్లె అని అబద్ధం చెప్పి పరిచయం చేసుకొన్నారు. తాము పొలంలో తవ్వకాలు జరుపుతుండగా మహిమగల పురాతన కమండలం లభించిందన్నారు. ఆ కమండలాన్ని మీకు విక్రయిస్తామని నమ్మించారు. మహిమ కలది కనుక రూ. 10 లక్షలు ఇవ్వాల్సిందిగా స్వామీజీని కోరారు. అంత డబ్బు తనవద్దలేదని ఆయన చెప్పారు. చివరకు రూ. 2లక్షలు ఇవ్వాలని కోరగా స్వామీజీ రూ.1.50 లక్షలకు బేరం కుదుర్చుకున్నాడు. ఈనెల 6తేదీన స్వామీజీని గుర్రంకొండ కోట వద్దకు నిందితులు పిలిపించుకున్నారు. అతని వద్ద నుంచి రూ.1.50 లక్షలు వసూలు చేసుకున్నారు. కమండలం పక్కనే ఉందని, వెళ్లి తీసుకొస్తామని నమ్మించి ఉడాయించారు. ఎంతసేపటికి వారు రాకపోవడంతో స్వామీజీ స్థానిక పోలీసులను ఆశ్రయించారు. అప్పట్లో ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. కలకడ సీఐ నాగేంద్ర పర్యవేక్షణలో ఎస్ఐ దిలీప్‌కుమార్ ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి నిందితులను మంగళవారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి నకిలీ కమండలం, రూ. 1.50లక్షల నగదును స్వాధీనం చేసుకొన్నట్లు వారు పేర్కొన్నారు. నిందితులను వాల్మీకిపురం కోర్టులో హాజరుపరిచినట్లు వారు తెలిపారు. కేసును నాలుగురోజుల్లో ఛేధించిన ఎస్ఐ దిలీప్‌కుమార్, సిబ్బందిని సీఐ అభినందించారు.

అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్‌నంటూ డబ్బులు వసూలు

కడప వన్‌టౌన్‌లో నిందితుడిపై కేసు నమోదు

కడప అర్బన్ : అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండలం రామచంద్రాపురం గ్రామం పాయలకుంట్లకు చెందిన బిల్లా నాగేశ్వరరావు తాను కడప మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌ను అంటూ గత కొంతకాలంగా అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నాడు. చిన్నతరహా వ్యాపార సంస్థలు, దుకాణాల వద్దకు వెళ్లడం తాను కడప మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి వచ్చానంటూ షాపులకు సంబంధించిన పన్నును నగరపాలక సంస్థకు కట్టడం లేదని, కొన్ని నెలల నుంచి పెండింగ్‌లో ఉన్నాయంటూ వారిని మభ్యపెట్టేవాడు. ఇలా వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో అమీన్‌పీర్ దర్గా రోడ్డులో నివాసం ఉంటూ బీకేఎం స్ట్రీట్‌లో సూపర్‌మార్కెట్‌ను నిర్వహిస్తున్న షేక్ అబ్దుల్ వాహిద్ దగ్గరకు వెళ్లిన నిందితుడు బిల్లా నాగేశ్వరరావు తన ఫోన్‌పేకి అతని వద్ద నుంచి రూ.8455లను వసూలు చేశాడు. ఇంకా మరో ఇద్దరినుంచి డబ్బులను వసూలు చేశాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప వన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు తెలిపారు. ప్రస్తుతానికి కడప వన్‌టౌన్ పరిధిలో నిందితుని చేతిలో మోసపోయిన బాధితులు ముగ్గురుగా గుర్తించామని, ఇంకా తమ విచారణలో బాధితుల వివరాలను సేకరిస్తున్నామన్నారు.

పట్టపగలే చోరీ

రూ. 5 లక్షలు నగదు అపహరణ


ఇంట్లో బీరువాను పగలగొట్టిన దృశ్యం

బ్రహ్మంగారిమఠం: బ్రహ్మంగారిమఠం మండలం కొత్తూరు గ్రామంలో సంగటి హోటల్ నడుపుకుంటున్న వేణుగోపాల్ ఇంట్లో మంగళవారం మధ్యాహ్నం దొంగలు బీరువాను పగలకొట్టి అందులో ఉన్న రూ. 5లక్షలు నగదు, కొన్ని బంగారు నగలు ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. పోలీసులు, బాధితుల కథనం మేరకు.. బ్రహ్మంసాగర్ రోడ్డులో సంగటి హోటల్ నడుపుకుంటున్న వేణుగోపాల్ కొత్తూరు నివాసి. ఉదయం 8గంటలకు హోటల్ దగ్గరకు వేణు , ఆయన భార్య వచ్చారు. హోటల్ సమయం పూర్తి చేసుకొని సాయంత్రం ఇంటికి వెళ్లగా ఇంటి తాళాలు తీసి ఉన్నట్లు గుర్తించారు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా కూడా తెరిచి ఉంది. అందులో దాచిన రూ. 5లక్షలు నగదు, కొంత బంగారు నగలు కన్పించలేదు. దీంతో బాధితుడు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు.

పోరుమామిళ్ల పంచాయతీ ఈఓపై ఆరోపణలు


ఈఓ సుబ్బారావును విచారిస్తున్న డీఎల్‌పీఓ

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల మేజర్ పంచాయతీ కార్యనిర్వహణాధికారి సుబ్బారావుపై వచ్చిన ఆరోపణలపై మంగళవారం డివిజనల్ పంచాయతీ అధికారి మస్తాన్‌వలి విచారించారు. సుబ్బారావు పంచాయతీకి సంబంధించిన ఆర్థిక వ్యవహారాల్లో అక్రమాలకు, అవినీతికి పాల్పడ్డారని 5 మంది వార్డు మెంబర్లు చేసిన ఆరోపణలపై విచారిస్తున్నట్లు మస్తాన్‌వలి తెలిపారు. భవనాల ప్లాన్ అప్రూవల్, పన్నులు తదితర అంశాల్లో ఆయన అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయన్నారు. మళ్లీ మరొకసారి విచారణ జరుగుతుందని విచారణ పూర్తయ్యాక పూర్తి నివేదిక జిల్లా కలెక్టర్‌కు ఇస్తామని ఆయన తెలిపారు.

స్కౌట్స్ శిక్షణతో సామాజిక బాధ్యత


మాట్లాడుతున్న భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ స్టేట్ సెక్రటరీ జి. భానుమూర్తిరాజు

కడప స్పోర్ట్స్ : స్కౌట్స్ శిక్షణతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, దేశభక్తి అలవడతాయని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర కార్యదర్శి జి. భానుమూర్తిరాజు పేర్కొన్నారు. మంగళవారం కడప నగరం శంకరాపురంలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సమావేశ మందిరంలో స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. స్కౌట్‌శిక్షణతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ అలవడతాయన్నారు. స్కౌట్ సర్టిఫికెట్ పొందే వారికి విద్య, ఉద్యోగాల్లో చక్కటి రిజర్వేషన్ సౌకర్యం ఉందని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తర్వాత బేసిక్, అడ్వాన్స్ శిక్షణ పొందిన 16 మంది స్కౌట్ మాస్టర్లకు, గైడ్ కెప్టెన్లకు స్టేట్ సెక్రటరీ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం నూతన రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన భానుమూర్తిరాజును జిల్లాకు చెందిన స్కౌట్స్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్‌లు గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్టేట్ ట్రైనింగ్ కమిషనర్ ఉమాదేవి, జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ ఎం. లక్ష్మీకర, కోశాధికారి రమణయ్య, అసిస్టెంట్ సెక్రటరీ శివప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం నాయకులు బి. శివశంకర్‌రెడ్డి, ఎం. ప్రవీణ్‌కిరణ్, సాజిద్, వివిధ పాఠశాలల స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు పాల్గొన్నారు.

అన్నమయ్య జిల్లా వాసికి ఏపీఎన్ఆర్టీఎస్ సాయం


ఈశ్వర్‌నాయుడుతో వైఎస్సార్‌సీపీ కువైట్ కమిటీ నాయకులు

కడప కార్పొరేషన్ : కువైట్‌లో ఇబ్బందులు పడుతున్న అన్నమయ్య జిల్లా వాసికి ఏపీఎన్ఆర్టీఎస్ సాయపడింది. ఫలితంగా అతను సురక్షితంగా స్వదేశానికి చేరాడు. ఏపీఎన్ఆర్టీఎస్ డైరెక్టర్ బీహెచ్ ఇలియాస్, వైఎస్సార్‌సీపీ కువైట్ కన్వీనర్ బాలిరెడ్డి తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. రాజంపేట నియోజకవర్గం సిద్ధవటం మండలం మిట్టపల్లె గ్రామానికి చెందిన ఈశ్వర్‌నాయుడు రెండేళ్ల కిందట కువైట్‌లో వ్యవసాయ క్షేత్రంలో సేద్య పనుల నిమిత్తం ఓ ప్రాంతానికి వెళ్లాడు. కువైటీ వేతనాలు సరిగా ఇవ్వకుండా ఎనిమిది గంటలకు బదులు 12 గంటలు పనిచేయించుకుంటూ వేధించేవాడు. దీంతో ఏడాదిన్నర క్రితం అక్కడి నుంచి పారిపోయిన ఈశ్వర్‌నాయుడు బయట భవన నిర్మాణ పనులు చేసేవాడు. రెండు నెలల క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. పాస్‌పోర్టు ఇస్తే స్వదేశానికి వెళ్లిపోతానని ఎంత బతిమాలినా స్పందన లేకపోగా కేసు పెట్టారు. తన తండ్రి ఇబ్బందుల్లో ఉన్న విషయాన్ని శివయ్యనాయుడు గల్ఫ్ కో కన్వీనర్ గోవిందు నాగరాజు, గల్ఫ్ ప్రతినిధి షేక్ ఫయాజ్‌లకు తెలిపారు. దీనిపై వారు వెంటనే స్పందించి భారత రాయబార అధికారులతో మాట్లాడి కువైటీ నుంచి పాస్‌పోర్టు ఇప్పించి ఇండియాకు పంపించారు. ఈశ్వర్‌నాయుడు మాట్లాడుతూ ఏపీఎన్ఆర్టీఎస్ ద్వారా ప్రవాసాంధ్రుల సమస్యలు పరిష్కరిస్తున్న సీఎం వైఎస్ జగన్‌తో పాటు తనను సురక్షితంగా స్వగ్రామానికి పంపేందుకు సహకరించిన భారత రాయబార అధికారులు, ఏపీఎన్ఆర్టీఎస్ చైర్మన్ మేడపాటి వెంకట్, సీఈఓ హేమలత, ఇలియాస్, బాలిరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, రెడ్డెయ్యరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

లారీ సహా రేషన్ బియ్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం బస్తాలు, లారీతో అధికారులు

చింతకొమ్మదిన్నె : కడప విజిలెన్స్ అధికారులు తమకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించి లారీతోపాటు 1137 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సీకే దిన్నె మండలం ఎన్‌హెచ్–40 రహదారిలోగల ఎస్సార్ పెట్రోలు బంకు వద్ద అధికారులు దాడులు నిర్వహించి ఏపీ07 టీహెచ్ 2678 నెంబరుగల లారీని తనిఖీ చేసి అందులోని 28,425 కిలోల 1137 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం దానిని సీకే దిన్నె పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. ఈ సందర్భంగా బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న వినుకొండకు చెందిన ఆర్వీ సాంబశివరావు, ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన లారీ డ్రైవర్ పఠాన్ మున్నా, అదే జిల్లాకు నాగులారానికి చెందిన లారీ ఓనర్ రేకుల రమణయ్యలపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు.


అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్న విజిలెన్స్ అధికారులు

12 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

వేంపల్లె : వేంపల్లె పట్టణ పరిధిలో ఉన్న ఎన్టీఆర్ సర్కిల్ వద్ద 12 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు కడపకు చెందిన విజిలెన్స్ అధికారి రెడ్డప్ప, పులివెందుల సీఎస్‌డీటీ గోవిందరావులు తెలిపారు. కదిరి గ్రామానికి చెందిన కుమార్‌నాయక్ వేంపల్లె టౌన్ చుట్టు పక్కల గ్రామాల నుంచి రేషన్ బియ్యాన్ని సేకరించి ఏపీ39టిఈ3078 నంబరు గల ఆటోలో అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని వేంపల్లె పోలీస్ స్టేషన్‌లో అప్పగించామన్నారు. రేషన్ బియ్యం, వాహనం మొత్తం విలువ సుమారు రూ.1,06,575లు ఉంటుందని తెలిపారు. నిందితుడిపై క్రిమినల్ కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడిలో వీఆర్వో లూకా, విజిలెన్స్ హెడ్ కానిస్టేబుల్ జనార్దన్‌రావు, హరినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూడు లారీలు ఢీ

ఒకరి మృతి, మరొకరికి తీవ్రగాయాలు


కనుమలోపల్లె వద్ద ఢీకొన్న లారీలను క్రేన్‌ల సాయంతో పక్కకు తీస్తున్న దృశ్యం

సిద్దవటం : మండలంలోని కనుమలోపల్లె గ్రామ సమీపంలో మంగళవారం తెల్లవారు జామున మూడు లారీలు ఢీకొన్న ప్రమాదంలో బళ్లారికి చెందిన లారీ డ్రైవర్ లక్ష్మణ్‌నాయక్ (37) మృతి చెందగా, మరోలారీ డ్రైవర్ తమిళనాడుకు చెందిన మురుగన్ తీవ్రంగా గాయపడ్డాడని ఎస్ఐ లక్ష్మినారాయణ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. నంద్యాలకు చెందిన లారీ డ్రైవర్ అన్సర్ బాషా మంగళవారం తెల్లవారుజామున కనుమలోపల్లె గ్రామ సమీపంలో ఆగేందుకు చిన్నగా వెళుతున్నాడు. ఇదే సమయంలో స్పాంజి ఐరన్‌లోడుతో బళ్లారి నుంచి చెన్నైకి వెళుతున్న లారీ ఆగుతున్న లారీని వెనుక వైపు ఢీకొంది. ఇంతలోనే కడప వైపునుంచి వచ్చిన సిమెంటు పౌడర్ ట్యాంకర్ బళ్లారి నుంచి వచ్చిన లారీని వెనుక వైపు ఢీకొంది. దీంతో ముందున్న లారీ ముందుకు వెళ్లడంతో బళ్లారికి చెందిన లారీ రోడ్డు పక్కకు దిగి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో బళ్లారికి చెందిన లారీ డ్రైవర్ లక్ష్మణ్‌నాయక్ తీవ్రగా గాయపడ్డాడు. అతన్ని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ వైద్యం పొందుతూ మృతి చెందాడు. సిమెంటు పౌడర్‌తో చెన్నైకి వెళుతున్న లారీ డ్రైవర్ తమిళనాడుకు చెందిన మురుగన్‌కు కూడా తీవ్ర గాయాలయ్యాయి. కడపలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు రహదారికి అడ్డంగా ఉన్న వాహనాలను క్రేన్‌ల సాయంతో పక్కకు తొలగించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


మృతిచెందిన రైతు

ముద్దనూరు : మండలంలోని చిన్నకత్తెర పల్లె గ్రామంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఉత్తప్ప(47)అనే రైతు మృతి చెందాడు. ఎస్ఐ చంద్రమోహన్ సమాచారం మేరకు సోమవారం రాత్రి 11గంటల సమయంలో ఉత్తప్ప అదే గ్రామానికి చెందిన ఓబులేసు అనే రైతు పొలంలోకి ఇరువురు కలిసి కాపలాకి వెళ్లారు. పొలంలో వెళ్తుండగా విద్యుత్ తీగ తగలడంతో ఉత్తప్ప మరణించాడు. మృతునికి భార్య, ఇరువురు సంతానం ఉన్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య


మహమ్మద్ రఫీ మృతదేహం

కడప అర్బన్ : కడప నగరం గంజికుంటకాలనీలో నివాసం ఉంటున్న షేక్ మహమ్మద్ రఫీ (26) అనే వ్యక్తి మద్యానికి బానిసగా మారి ఇంటిలో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య షహనాజ్, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఇతను హైదరాబాద్‌లో క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రెండు లేదా మూడు నెలలకు ఒకసారి హైదరాబాద్ నుంచి కడపకు వచ్చేవాడు. ఈ క్రమంలోనే రెండు రోజుల క్రితం కడపకు వచ్చాడు. వచ్చినప్పటి నుంచి మద్యం సేవిస్తూ, భార్య, అమ్మ మహబూబ్‌బీతో గొడవపడ్డాడు. ఈనెల 9వ తేదీన భార్యతో గొడవపడి, భార్యా,పిల్లలను ఆమె పుట్టింటికి పంపించేశాడు. తన తల్లిని దేవునికడపలో తన చెల్లెలు ఇంటికి పంపించేశాడు. తరువాత ఉరి వేసుకున్నాడు. ఉదయం స్థానికులు గమనించి భార్య, తల్లికి, బంధువులకు సమాచారం ఇచ్చారు. చిన్నచౌక్ ఎస్ఐ రవికుమార్ కేసు నమోదు చేశారు.

ఎస్వీ వేద విశ్వవిద్యాలయంతో వైవీయూ ఎంఓయూ


ఎంఓయూ కుదుర్చుకుంటున్న దృశ్యం

వైవీయూ : తిరుపతి శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంతో యోగివేమన విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందం (మెమొరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్) కుదుర్చుకుంది. వైవీయూ ఆర్ట్స్ విభాగం డీన్, సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో నిపుణుల బృందం తిరుపతి ఎస్.వి. వేద విశ్వవిద్యాలయంలో వైస్ చాన్సలర్ ఆచార్య రాణి సదాశివమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య రాధేశ్యామ్‌లతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందం ప్రకారం వైవీయూ పరిధిలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలోని తాళపత్ర గ్రంథాలన్నింటినీ డిజిటలైజేషన్ చేయడం, ప్రాచ్య భాషాసాహిత్యాలపై సంయుక్తంగా పరిశోధనలు చేయడం, విద్యార్థులకు, పరిశోధకులకు డిజిటలైజేషన్ ప్రక్రియలో శిక్షణ ఇవ్వడం, విశ్వవిద్యాలయాలు డిజిటలైజేషన్ చేసిన సాహిత్యాన్ని, తాళపత్ర గ్రంథాలను పరస్పరం సరఫరా చేసుకోవడం, భద్రపరచడం వంటివి నిర్వహించనున్నారు. వీటితో పాటు పరిశోధక విద్యార్థులను రెండు విశ్వవిద్యాలయాలు పరస్పరం మార్పిడి చేసుకోవడం మొదలైన అంశాలపైనా రెండు విశ్వవిద్యాలయాల అధికారులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. కార్యక్రమంలో వైవీయూ పాలకమండలి సభ్యుడు డాక్టర్ మూల మల్లికార్జున రెడ్డి, మొల్ల సాహితీపీఠం అధ్యక్షుడు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు, రాష్ట్ర ఆర్కైవ్స్ డైరెక్టర్ డాక్టర్ రంగరాజు, తాళపత్ర గ్రంథనిధి ప్రాంతీయ డైరెక్టర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ ఒప్పందం పట్ల వీసీ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య వేద విశ్వవిద్యాలయం అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

వైవీయూలో పరిశోధనాంశంగా జిల్లా వాసుల సాహిత్యం


తవ్వా ఓబుళరెడ్డి


డాక్టర్ వేంపల్లె షరీఫ్

మైదుకూరు/వేంపల్లె : జిల్లాకు చెందిన ఇద్దరు సాహితీవేత్తల జీవితం– సాహిత్యం యోగివేమన యూనివర్సిటీలో పరిశోధనకు ఎంపికైంది. ఖాజీపేట మండలం బుక్కాయపల్లెకు చెందిన ప్రముఖ కథా రచయిత తవ్వా ఓబుళరెడ్డి మైదుకూరు బాలుర జెడ్పీ హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. ఆయన కడుపాత్రం పేరుతో ఇటీవల కథా సంపుటిని వెలువరించారు. పాత్రికేయుడుగా, చరిత్రకారుడుగా కృషి చేస్తున్నారు. సాహిత్యంలోనే కాక పాఠ్యపుస్తకాల రూపకల్పనలో పాల్గొన్నారు. తెలుగు భాష అభివృద్ధికి కృషి చేస్తున్నారు. తన జీవితం–సాహిత్యం పరిశోధన అంశంగా ఎంపిక చేసినట్లు యూనివర్సిటీ నుంచి తనకు సమాచారం అందిందని ఆయన తెలిపారు. అలాగే వేంపల్లెకు చెందిన కథా రచయిత డాక్టర్ పల్లె షరీఫ్ పాతికేళ్లుగా సాహిత్య సృజన చేస్తున్నారు. ఆయన రచించిన జుమ్మా పుస్తకం కన్నడ, ఇంగ్లీషు భాషల్లోకి అనువాదమైంది. కర్ణాటక ప్రభుత్వం 2018లో జుమ్మా పుస్తకాన్ని ఉత్తమ కథా సంకలనంగా ప్రకటించి గౌరవించింది. 2012లో భారత ప్రభుత్వం ఈ పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడమి యువ పురస్కారం ప్రకటించింది. ఈ మేరకు తమ రచనలను పీహెచ్‌డీ పరిశోధనలకు ఎంపిక చేయడం పట్ల వారు వైవీయూ వైస్‌చాన్సలర్ చింతా సుధాకర్, ఇతర అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.